క్లుప్తంగా

వ్యాక్సినేషన్ తప్పనిసరి

ఎర్రుపాలెం/మధిర రూరల్: ప్రతీ చిన్నారికి వ్యాక్సిన్ వేస్తూ వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి చందూనాయక్ సూచించారు. ఎర్రుపాలెం మండలంలోని బనిగండ్లపాడు, మధిర మండలంలోని దెందుకూరు పీహెచ్‌సీలను శుక్రవారం సందర్శించిన ఆయన వాక్సిన్ల నిల్వలు, వ్యాక్సినేషన్ రికార్డులను పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. వైద్యాధికారులు వీరబాబు, ప్రశాంత్, శశిపూర్ణతో పాటు వెంకటరమణ, రమణ, కాంతమ్మ, సదాశివరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణాలు పంపిణీ



రుణం అందిస్తున్న మేనేజర్ దివ్య, సొసైటీ చైర్మన్ సాంబశివరావు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని డీసీసీబీ బ్యాంక్ కార్యాలయంలో శుక్రవారం అయ్యవారిగూడెం సొసైటీకి చెందిన 29మంది రైతులకు రూ. 57.88 లక్షల రుణాలను బ్యాంక్ మేనేజర్ దివ్య, సొసైటీ చైర్మన్ అనుమోలు సాంబశివరావులు పంపిణీ చేసి మాట్లాడారు. రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, క్యాషియర్ మౌనిక, జానీ, సంఘం సెక్రెటరీ మోహన్‌రావు తదితరులున్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా సైదులు



మండా సైదులు

మధిర: సీపీఎం మధిర మండల కార్యదర్శిగా మండా సైదులు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం బుచ్చిరెడ్డి పాలెంలో నిర్వహించిన ఆ పార్టీ మండల మహాసభలో.. నూతన కర్తవ్యాలతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీకి మండా సైదులు తిరిగి మూడో సారి కార్యదర్శిగా ఎన్నిక కాగా.. అంజె శివయ్య, కారుమంచి జోజి, గౌర్రాజు ధనలక్ష్మి తదితరులు మండల కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రమేష్, చింతలచెరువు కోటేశ్వరరావు, శీలం నరసింహారావు హాజరయ్యారు.

జామేమసీద్ కమిటీ సదర్‌గా రసూల్



నాయబ్ రసూల్

సత్తుపల్లి: సత్తుపల్లి జామే మసీద్, మార్కెట్ మసీద్ కమిటీల సదర్(అధ్యక్షుడి)గా ఎస్.కే.నాయబ్ రసూల్ ఎన్నికయ్యారు. మూడు నెలలుగా ఈ కమిటీల ఎన్నిక వాయిదా పడుతూ వస్తోంది. ఈ నేపథ్యాన శుక్రవారం మషూరా కమిటీ బాధ్యులు ఎస్.కే.మౌలాలీ, ఎస్.కే.రఫీ సహాట ఎన్నిక నిర్వహించగా ఉత్కంఠభరితంగా సాగాయి. మసీద్ కమిటీ నూతన సదర్‌గా ఎన్నికైన ఎస్.కే.నాయబ్ రసూల్‌ను పలువురు అభినందించగా, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంపై మసీద్ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో ఎం.డీ.కమల్‌పాషా, ఎస్.కే. మౌలాలీ, ఎస్.కే.రఫీ, ఎం.డీ.రియాజుద్దీన్, ఎస్.కే.మునీర్, ఎస్.కే.వాహేద్, అబీద్‌అలీ, అయూబ్‌పాషా, సయ్యద్ ఖలీల్, అమీర్‌జానీ, మున్వర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం..

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలకు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడిగా నియమితులైన గౌర్రాజు నాగరాజు దంపతులను ఎమ్మార్సీ కేంద్రంలో శుక్రవారం ఎంఈఓ బి.మురళీమోహన్‌రావు, పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. సీఆర్‌పీగా నాగరాజు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. నాగరాజు సతీమణి.. స్రవంతి కూడా డీఎస్సీలో ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం పొందడంపై అభినందించారు. నాయకులు శ్రీనివా సరావు, వెంకటేశ్వర్లు, సంగిరెడ్డి సైదారావు, కోటేశ్వరరావు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో కేసులు నమోదు

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరుకు చెందిన బాలికపై ఆమె మేనమామ అశోక్, తాత రవి, అత్తయ్య లింగమణి శుక్రవారం దాడి చేశారు. ఘటనపై ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

- పందిళ్లపల్లి సమీపాన ఆటో, ద్విచక్ర వాహనం గురువారం ఎదురెదురుగా ఢీకొనగా పలువురికి గాయాలయ్యాయి. బైక్‌పై రాంగ్ రూట్‌లో వెళ్తున్న ముగ్గురు ఆటోను ఢీకొట్టగా ఈ ప్రమాదం జరిగింది. ఆటో డ్రైవర్ బానోతు మధు శుక్రవారం చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.
- లచ్చగూడెం, నర్సింహాపురం, రామకృష్ణాపురంల్లో ఈనెల 2వ తేదీ అర్ధరాత్రి వ్యవసాయ పొలాల్లోని నాలుగు విద్యుత్ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధిత రైతులు వంకాయలపాటి కోటేశ్వరరావు, లోయ వెంకయ్య, నాగరాజు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పెచ్చులూడుతున్నాయ్..!

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు

- రాలుతున్న భవనాల స్లాబ్
- ఆందోళనలో ఉద్యోగులు, సిబ్బంది
- పట్టించుకోని అధికారులు



శిథిలావస్థలో ఉన్న శాఖ గ్రంథాలయం



శిథిలావస్థలో ఉన్న ముదిగొండ పీహెచ్‌సీ భవనాలు

ముదిగొండ: పాలన అందించే ప్రభుత్వ కార్యాలయాలే శిథిలావస్థకు చేరుకున్నాయి. గోడలు, పిల్లర్లు, శ్లాబ్ నుంచి ఇసుక, కంకర రాలుతున్నాయి. పెచ్చులూడి పడుతుండటంతో ఉద్యోగులు, సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు. నిత్యం ఏదో పని మీద ఆయా కార్యాలయాలకు వందల సంఖ్యలో ముదిగొండ కేంద్రానికి ప్రజలు వివిధ గ్రామాల నుంచి వస్తుంటారు. ఈ క్రమంలో ఏ గదిలోకి వెళ్లి గంటపాటు నిలుచున్న ఎప్పుడు పై నుంచి పెచ్చులూడి మీదపడతాయోనని ప్రజలు వాపోతున్నారు.

మరమ్మతులపై ప్రకటనలు మాత్రమే..

స్థానిక తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం గదుల్లో ఎక్కడపడితే అక్కడ భవనం పెచ్చులూడుతోంది. తహసీల్దార్ కార్యాలయం ఇరుకు గదులు కావడంతో పాటు సిబ్బందికి విలువైన ఫైళ్లు బీరువాల్లో, సెల్ఫుల్లో నిల్వ ఉంచడానికి వీలు లేకుండాపోవడంతో ఎక్కడపడితే అక్కడ రికార్డులు పడేస్తున్నారు. సరైన ఫర్నీచర్ లేక, దాచేందుకు వీలులేక ఖాళీ ఉన్న చోటు పడవేస్తున్నారు. కంప్యూటర్ ఆపరేటర్ గదుల్లోకి ఇక ఎవరూ వెళ్లే ప్రసక్తి లేదు. ఆన్‌లైన్ ప్రక్రియ చేసేందుకు అధిక మొత్తంలో ఫైళ్లు నిల్వ ఉంచి చేస్తున్నారు. రాత్రి వాచ్‌మెన్ లేక విలువైన పత్రాలకు, కార్యాలయాలకు భద్రత కరువైంది. మండలపరిషత్, తహసీల్దార్, మండల విద్యావనరుల కేంద్రం అన్నీ ఒకే ప్రాంగణంలో ఉండడంతో వచ్చిన ప్రజలకు సరైనా సౌకర్యాలు లేక ఆరు బయట చెట్ల కింద, రోడ్లపై వాహనాలను ఉంచి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం మరమ్మతుల పేరిట కేటాయించి పనులు చేడుతున్నట్లు ప్రకటించినా అవి ఇక్కడ మరమ్మతులకు నోచుకోవడం లేదని ఆరోపణలొస్తున్నాయి.

అన్ని భవనాల పరిస్థితి అంతే..

ఇదిలా ఉండగా శాఖ గ్రంథాలయం, పశువుల ఆస్పత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన క్వార్టర్స్ ఇలా చాలా ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షాలకు గోడలు నానిపోయి పాకుడు పట్టి పడిపోయే పరిస్థితిలో ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఉన్న క్వార్టర్స్ శిథిలావస్థకు చేరి ఖాళీగా దర్శనమిస్తున్నాయి. సొసైటీ కార్యాలయం శిథిలావస్థలో ఉండడంతో గతేడాది కూల్చివేశారు. ఆ కార్యాలయం అద్దె భవనంలో రైతులకు ఇబ్బందికరంగా మారింది. సంబంధిత జిల్లా స్థాయి అధికారులు చొరవ తీసుకుని పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని, నూతన భవనాల ప్రతిపాదన చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు..



ప్రభుత్వ కార్యాలయాలు ప్రమాదభరితంగా మారాయి. ప్రభుత్వాలు మారినా, కార్యాలయాలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. కార్యాలయంలో ఉన్న సమయంలో గదుల్లో పెచ్చులూడి మీద పడతాయోమోనని భయమేస్తుంది. విలువైన రికార్డులు, ఫైళ్లు, భద్రపరచడానికి వీలు లేకుండాపోయింది. అధికారులు చొరవ తీసుకొని మరమ్మతులు చేయించాలి.

– రాయల శ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్, వెంకటాపురం, ముదిగొండ

రావాలంటేనే భయమేస్తోంది..



కార్యాలయాలకు రావాలంటేనే భయమేస్తుంది. 25 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో గదుల్లో శ్లాబ్ పై పెచ్చులూడి పోతుంది. కనీసం సంవత్సరానికి ఒక సారి మరమ్మతులు చేయించి ప్రమాదాలు జరగకుండా చూడాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు నిధులతో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాలి. ఎక్కడ నిల్చున్నా చిన్న చిన్న పెచ్చులు, ఇసుక రాలుతుంది, వర్షానికి కురుస్తున్నాయి.

– నూకల నాగేశ్వరరావు, మేడేపల్లి

ఆర్‌ఓ ప్లాంట్లను కాపాడుకోవాలి



వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న సింగరేణి పీఓ ప్రహ్లాద్

సత్తుపల్లిరూరల్: సింగరేణి యాజమాన్యం సత్తుపల్లిలోని ఓసీ ప్రభావిత ప్రాంత ప్రజల కోసం శుద్ధి జలప్లాంట్లను ఏర్పాటు చేశారు. అయితే సత్తుపల్లిలోని వెంగళరావునగర్, ఎన్టీఆర్‌నగర్‌లలో ఏర్పాటు చేసిన ప్లాంట్లు రిపేర్‌కు రావటంతో.. కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలేంరాజు సూచన మేరకు జేవీఆర్ ఓసీ పీఓ ప్రహ్లాద్ లక్షాముప్పైవేల రూపాయలతో మరమ్మతులు చేయించి స్థానిక వార్డు కౌన్సిలర్లకు అప్పగించారు. వీటిని శుక్రవారం పీఓ ప్రారంభించి మాట్లాడుతూ.. స్థానిక ప్రజలు ఆర్‌వో ప్లాంట్లను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో జేవీఆర్ ఓసీ వెల్ఫేర్ ఆఫీసర్ కె.దేవదాస్, వార్డు కౌన్సిలర్ నాగుల్‌మీర పాల్గొన్నారు.

ఆర్టీసీలో గ్రాండ్‌హెల్త్ ఛాలెంజ్-ఎస్ ప్రారంభం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ ఉద్యోగుల జీవిత భాగస్వాములకు ఆరోగ్య పరీక్షలకు సంబంధించిన గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్-ఎస్ కార్యక్రమాన్ని శుక్రవారం డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగుల ఆరోగ్య భద్రతతో పాటు ఆర్టీసీలోని ఉద్యోగుల జీవిత భాగస్వాముల ఆరోగ్యం కూడి ముఖ్యమనే భావంతో యాజమాన్యం ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ నెల 26, 28, 29వ తేదీల్లో డిపోలో వైద్య పరీక్షలు నిర్వహించబడతాయన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, ఎంఎఫ్ సాహితి, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనులు..

చింతకాని: మండలంలోని రేపల్లెవాడ గ్రామం నుంచి మత్కేపల్లి తుమ్మలమ్మ చెరువు దగ్గర ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు నిర్మించనున్న బీటీ రహదారి నిర్మాణ పనులను శుక్రవారం నాయకులు ప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క రూ.కోటి నిధులను మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసరావు, ఏఈ రాంబాబు, దేవాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తోటకూరి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పార్కు పనులను పరిశీలిస్తున్న మట్టా దయానంద్, తదితరులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలో నిర్మాణంలో ఉన్న పలు అభివృద్ధి పనులను రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ శుక్రవారం పరిశీలించి వేగవంతం చేయాలని సూచించారు. స్థానిక 100 పడకల ప్రభుత్వాస్పత్రి, అంబేడ్కర్ భవన నిర్మాణ పనులతో పాటు జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. తామరచెరువు సమీపంలోని ఫ్రీడమ్ పార్కు పనులను పరిశీలించి నాణ్యతలో లోపాలు ఉన్నాయని, మళ్లీ పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈయన వెంట ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, భీమిరెడ్డి సుబ్బారెడ్డి, సందీప్‌గౌడ్, ప్రసాద్ పాల్గొన్నారు.

27న ముదిగొండలో భట్టి పర్యటన

ముదిగొండ: మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ నెల 27న ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారని కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిరుమర్రి-వెంకటాపురం, ముదిగొండ-రాఘవాపురం, వెంకటాపురం-యడవల్లిలక్ష్మీపురం, యడవల్లి-కట్టకూరు, మాధాపురం-యడవల్లి బీటీ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. భట్టి పర్యటనను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

27న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సమావేశం

ముదిగొండ: మండలంలోని సువర్ణాపురంలో ఈనెల 27న తెలంగాణ ఉద్యమకారుల మండల ఫోరం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పసుపులేటి నాసరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్రస్టీరింగ్ కమిటీ చైర్మన్ కేవీ కృష్ణారావు హాజరవుతారని తెలిపారు.

చెరువులో చేప పిల్లలు విడుదల

మధిర: మధిర పెద్ద చెరువులో శుక్రవారం మత్స్య శాఖ అధికారులు, సొసైటీ సంఘ సభ్యుల సమక్షంలో మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత, కమిషనర్ సంపత్ కుమార్ చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. మత్స్య శాఖ ఆధ్వర్యంలో 100శాతం రాయితీపై చేప పిల్లలను విడుదల చేయడం జరుగుతుందన్నారు. మొదటి విడతలో భాగంగా 50శాతం చేప పిల్లలను చెరువులోకి విడుదల చేశామని, మత్స్య సహకార సంఘ సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ ఏడీ శివప్రసాద్, గ్రీష్మ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఓసీ ఉద్యోగి మృతి

సత్తుపల్లి: సత్తుపల్లి జేవీఆర్ ఓసీ ప్రాజెక్ట్ కార్యాలయం డిప్యూటీ సూపరింటెండెంట్ కొప్పుల గోవర్ధన్‌రెడ్డి(55) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, సింగరేణి పీఓ ప్రహ్లాద్, సింగరేణి అధికారులు, యూనియన్, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు సందర్శించి నివాళులర్పించారు.

దాసరి పద్మ సేవలు చిరస్మరణీయం

తల్లాడ: సంఘ సేవకురాలు, సినీ నిర్మాత దాసరి పద్మ సేవలు చిరస్మరణీయమని మండల విద్యాశాఖాధికారి ఎన్.దామోదరప్రసాద్ అన్నారు. శుక్రవారం అన్నారుగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో దాసరి పద్మ స్మారక యువజన సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించి.. కేక్ కట్ చేశారు.కార్యక్రమంలో దాసరి పద్మ స్మారక యువజన సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు గుమ్మా నరేష్, గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

తాతా రంగారావుకు నివాళి..

వైరారూరల్: మండలంలోని తాటిపూడిలో అనారోగ్యంతో మృతిచెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, వైరా సొసైటీ మాజీ చైర్మన్ తాతా రంగారావు మృతిచెందాడు. ఆయన భౌతికాయానికి శుక్రవారం మాజీ ఎమ్మెల్యేలు లావుడ్యా రాములు నాయక్, కొండబాల కోటేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్‌లు పూలమాలతో నివాళులర్పించారు. మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు తాతా రంగారావు కుటుంబ సభ్యులను ఫోన్లో పరామర్శించి సానుభూతి తెలిపారు.

కమల్‌రాజ్ జన్మదిన వేడుకలు

బోనకల్/ఎర్రుపాలెం: మాజీ జెడ్పీ చైర్మన్, మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజ్ జన్మదిన వేడుకలను మండలంలో బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం బోనకల్ మండలంలోని శాంతినిలయంలో కేక్‌కట్ చేసి మానసిక వికలాంగులకు అన్నదానం చేశారు. పంబి సాంబశివరావు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు నాగేశ్వరావు, ప్రసాద్, శ్రీను, మస్తాన్‌వలీ, కిశోర్, తిరుపతిరావు, రవి పాల్గొన్నారు.

పుల్లయ్య అరెస్ట్ సరికాదు..

చింతకాని: బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయటం సరైంది కాదని బీఆర్‌ఎస్, సీపీఎం మండల కమిటీ నాయకులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బీఆర్‌ఎస్, సీపీఎం మండల నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ధర్నాలు, రాస్తారోకోలు సహజమని, ప్రజాశ్రేయస్సే రాజకీయ పార్టీల అంతిమ లక్ష్యమన్నారు. తక్షణమే పుల్లయ్యను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గోపాలరావు, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి వెంకట్రామయ్య, నాయకులు రమేష్, హనుమంతురావు, ప్రసాద్, రత్నాకర్, రమేష్, లచ్చయ్య, తదితరులు ఉన్నారు.

ముగిసిన ట్రైయినీ అధికారుల పర్యటన



అంగన్‌వాడీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న ట్రైయినీ అధికారులు

కారేపల్లి: ఐదు రోజుల పర్యటనలో భాగంగా.. కారేపల్లి మండలం ఆలియాతండా గ్రామానికి వచ్చిన సివిల్ సర్వీసెస్ ట్రైయినీ అధికారుల బృందం పర్యటన శుక్రవారంతో ముగిసింది. శుక్రవారం అంగన్‌వాడీలో ప్రదర్శించిన 15రకాల వంటకాలను అధికారులు రుచిచూసి పోషకాలపై అంగన్‌వాడీ టీచర్లను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా హెల్త్ సబ్‌సెంటర్‌లో ఎఎన్‌ఎంలు చిన్నపిల్లలకు వేస్తున్న టీకాలుపై ఆరా తీశారు. చివరిరోజు సందర్భంగా బతుకమ్మలను తాయరు చేసి గ్రామ మహిళలు ఆటపాటలతో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను అధికారులకు వివరించి ఘనంగా సన్మానించారు. అనంతరం కారేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ నీటి సరఫరా పై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సర్వీసెస్ ట్రైయినీ అధికారులు అల్తామస్ ఘాజీ, వైభవ్‌మీనా, తేజస్వినీ, అనితామీనా, విపుల్ సింఘాల్, ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓ రవీంద్రప్రసాద్, సీడీపీఓ దయామణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల సందర్శన..



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

ఏన్కూరు: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను ఆల్ ఇండియా సర్వీసెస్, సెంట్రల్ సివిల్ సర్వీసెస్‌కు చెందిన శిక్షణ అధికారులు శుక్రవారం సందర్శించారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, సొసైటీ కార్యాలయం, ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం, గురుకుల విద్యాలయాలను సందర్శించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ట్రైయినీ అధికారులు అంకిత్‌యాదవ్, ఇషాన్‌గుప్తా, అల్తాఫ్ మహమ్మద్ షేక్, శుభం పంకజ్‌కుమార్ మీనా, మండల అధికారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలి



మాట్లాడుతున్న సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి

కారేపల్లి: విద్యార్థులు తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'ప్రిన్సిపాల్ ఎస్ విజయకుమారి'అధ్యక్షతన నిర్వహించిన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి సమాజంలో విద్యార్థులు పెడదోవ పడుతున్నారని, మన సత్ప్రవర్తనే మన కన్న తల్లిదండ్రులకు, విద్యాబుద్ధులు నేర్పించే గురువులకు మనం ఇచ్చే కానుక అని, కృషి పట్టుదలతో చదివితే సాధించలేనిది ఏదీ లేదని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అందించారు. అదే విధంగా కళాశాల అభివృద్ధికి సహకరిస్తున్న శ్రీకోటమైసమ్మతల్లి దేవస్థానం ధర్మకర్త పర్సా పట్టాభిరామారావును ప్రిన్సిపాల్ ఎస్.విజయకుమారితో పాటు, అధ్యాపక బృందం సన్మానించింది. ఈ కార్యక్రమంలో పోస్టుమెట్రిక్ హాస్టల్ (బాలురు, బాలికలు) వార్డెన్‌లు వీరన్న, స్వర్ణలత, అధ్యాపక బృందం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ మధు

మధిర: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని మధిర సీఐ మధు పిలుపునిచ్చారు. మధిర పట్టణంలోని శ్రీనిధి జూనియర్, డిగ్రీ కళాశాలలో శుక్రవారం యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాము, చంద్రశేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

మధిర: ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదుపై మధిర మండలంలో వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు చిలుకూరి సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పోలె సుధాకర్ మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కుకై దరఖాస్తు చేసుకోవాలని, ఓటు నమోదు కోసం నవంబర్ 6 వరకు గడువు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు బ్రహ్మారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర ధాన్యం చెక్‌పోస్టులు ప్రారంభం



చెక్‌పోస్టును ప్రారంభిస్తున్న దృశ్యం

కల్లూరురూరల్: అంతర్రాష్ట్ర ధాన్యం చెక్‌పోస్టులను కల్లూరు మండలంలోని తాళ్లూరు వెంకటాపురం, దారుగా బంజర్లలో శుక్రవారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రంలో పండించే వరి పంటను ఇక్కడి ప్రభుత్వం కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తుండడంతో ఆంధ్రప్రదేశ్ నుంచి ధాన్యం ఇక్కడికి రాకుండా కట్టడి చేయడానికి అంతర్రాష్ట చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరు తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎస్సై షాకీర్, సివిల్ సప్‌లై డిప్యూటీ తహసీల్దార్, సొసైటీ చైర్మన్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సాగర్ కాల్వకట్టపై కల్లం ఏర్పాటు

కల్లూరురూరల్: మండలంలోని కప్పలబంధం పంచాయతీ పరిధిలో రైతులు ఖరీఫ్‌లో పండిన వరి పంటను ఆరబెట్టేందుకు సమీపంలోని నాగార్జున సాగర్ ప్రధాన కాలువ కట్టపై శుక్రవారం కల్లం ఏర్పాటు చేశారు. ఈ గ్రామ పరిధిలో పండిన వరిని ఆరబెట్టేందుకు గాను అనువైన స్థలం లేకపోవటంతో.. సాగర్ ప్రధాన కాలువ 72వ కిలోమీటర్ రెగ్యులేటర్ వద్ద ధాన్యం ఆరబెట్టేందుకు వీలుంటుందని రైతులు స్థానిక ఎమ్మెల్యే రాగమయి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె సూచనలతో ఆ ప్రాంతాన్ని చదును చేశారు. కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ, కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్, మాదవ్, పిచ్చిరెడ్డి, నాగిరెడ్డి, సత్యం, వెంకటేశ్వరరావు, కృష్ణారెడ్డి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు గ్రామంలో శుక్రవారం శ్రీసత్య సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 34 పశువులకు గర్భధారణ, 25 పశువులకు నత్తలమందు, 11 పశువులకు పలు రకాల వ్యాధులకు డాక్టర్లు కృష్ణారెడ్డి, ఉమా పరీక్షలు చేశారు. 750 గొర్రెలకు క్యాల్షియం తాగించారు. అనంతరం తక్కెళ్లపాడు శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం గోశాలలో గోవులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాదళ్ ఆర్గనైజర్ భాస్కర్‌రావు, కృష్ణమూర్తి, వెంకట్రామిరెడ్డి, కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

ఏన్కూరు: ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జాతీయ నాయకుడు మందడపు సాయిబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని ఆరికాయలపాడులో నిర్వహించిన ఆ పార్టీ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. బీజేపీని గద్దె దించే వరకు పోరాటాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించిన బీఆర్‌ఎస్‌ను ప్రజలు ఓడించి కాంగ్రెస్‌ను గెలిపిస్తే.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నేరవేర్చడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరావు, నాయకులు వీరభద్రం, రాంబాబు, సత్యనారాయణ, నాగేశ్వరావు, బాలాజీ పాల్గొన్నారు.

మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయండి



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు బసవయ్య, తదితరులు

తల్లాడ: నవంబర్ 3న హైదరాబాద్‌లో నిర్వహించే ధర్మ సమాజ్ పార్టీ మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మేడి బసవయ్య అన్నారు. శుక్రవారం తల్లాడ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. పూలే, అంబేడ్కర్, కాన్షీరాం కలలు గన్న బీసీ, ఎస్సీ, పీడిత ప్రజల రాజ్యాధికారమే లక్ష్యంగా ధర్మ సమాజ్ పార్టీ పని చేస్తుందన్నారు. ఇందు కోసం ధర్మ సమాజ్ పార్టీ అదనేత విశారదన్ ఆధ్వర్యంలో జిల్లాలో పలు చోట్ల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శివన్, కాంతారావు, శ్రీనివాసరావు, నరసింహారావు, రవి పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం..

మధిరరూరల్: ఖమ్మం జిల్లా సకల ప్రభుత్వ ఉద్యోగుల టీఎన్జీవో ఆధ్వర్యంలో నవంబర్ 3న ఖమ్మంలో జరిగే ఆత్మీయ సమ్మేళనానికి జిల్లా ప్రభుత్వ సకల ఉద్యోగులు హాజరుకావాలని మధిర నియోజకవర్గం టీఎన్జీవో నాయకులు గుర్రం శ్రీనివాసరావు, గద్దల రజనీకాంత్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆ సంఘ పోస్టర్లను తహసీల్దార్ రాంబాబు ఆవిష్కరించి మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనానికి జిల్లాలోని మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో లింగాల నాగేశ్వరరావు, కిరణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.